

అక్రమ రవాణాకు చెక్ పడేనా..?

- అటవీశాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టుల ఏర్పాటు
- అంతర్రాష్ట్ర రవాణాపై ప్రత్యేక దృష్టి
- చెన్నూరు, కోటపల్లి మండలాల్లో టోల్‌గేట్లు ఏర్పాటు
- వాహనానికి ఓ రేటు చొప్పున పన్ను వసూలు
- త్వరలో ప్రారంభించేందుకు అధికారుల సన్నాహాలు

మంచిర్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లలు దాటిపోతున్న కలప, ఇతర అటవీ ఉత్పత్తులతోపాటు పీడీఎస్ బియ్యంపై ప్రత్యేక నిఘా ఉంచేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. జిల్లాలో ఇప్పటి వరకు అటవీ చెక్ పోస్టులు ఉండగా, కొత్తగా ఏర్పాటు చేయబోయే చెక్‌పోస్టులకు మాత్రం ప్రత్యేకత ఉంది. చెన్నూరు మండలం కిష్టంపేట, కోటపల్లి మండలం పారుపల్లి వద్ద అటవీశాఖ కొత్తగా చెక్ పోస్టులు ఏర్పాటు చేయనుండగా, వాటి పరిధిలో ప్రత్యేకంగా టోల్‌గేట్‌లు ఏర్పాటు చేయనున్నారు. జాతీయ రహదారులపై కాంట్రాక్టరు ఏర్పాటు చేసిన విధంగా ఫారెస్టు పరిధిలో పయణించే వాహనాలకు అటవీశాఖ ప్రత్యేకంగా టోల్‌గేట్లు ఏర్పాటు చేయనుంది. టోల్ గేట్ల వద్ద పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రత్యేకంగా చెస్ వసూలు చేసేందుకు అధికారులు అవ సరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం టోల్ గేట్ల విషయమై ఇప్పటికే అటవీశాఖకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా త్వరలో ప్రారంభించేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వాహనాలకు పన్ను వసూలు..

రెండు రాష్ట్రాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సిద్ధపడుతున్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే చెన్నూరు అటవీ రేంజ్ పరిధిలో రెండు టోల్‌గేట్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అడవుల సంరక్షణతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం పన్ను వసూలు చేయనున్నారు. భారీ వాహనాలకు రూ. 200, ఫోర్ వీలర్‌కు రూ. 50, త్రీ వీలర్‌కు రూ. 30 చొప్పున వసూలు చేయను న్నారు. టోల్ గేట్ల ద్వారా లభించే ఆదాయంతో చెన్నూరు అటవీ డివిజన్ పరిధిలోని ప్రాణహిత కృష్ణ జింకల అభయారణ్యంలో అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం, వన్య ప్రాణులకు తాగునీటి వసతుల కల్పనతో పాటు అటవీ సంపద అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వంతెనపై నుంచి నిత్యం సగటున 200 వందల వరకు...

(తరువాయి 7లో)

అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా...

కోటపల్లి మండలం పారుపల్లి సమీపంలోని ప్రాణహిత నదిపై తెలంగాణ-మహారాష్ట్రలను కలుపుతూ అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణం జరిగినప్పటి నుంచి రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు విరివిగా పెరిగిపోయాయి. ఇదే అదునుగా వంతెనపై నుంచి కలప, రేషన్ బియ్యం, మద్యం, ఇతర వ్యాపార సంబంధిత అక్రమ రవాణా కూడా జోరుగా సాగుతోంది. దీంతో పోలీసు, అటవీశాఖ అంత రాష్ట్ర వంతెనపై పూర్తిస్థాయిలో దృష్టిసారించాయి. వంతెనపై నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, అక్రమ రవాణా కూడా జరుగుతోందన్న భావనలో అటవీశాఖ ఉంది. ప్రాణహిత నది మార్గంగా మహారాష్ట్ర నుంచి తెలంగాణకు టేకు కలప విరివిగా అక్రమ రవాణా జరుగుతోంది. ఇటీవల పెద్ద మొత్తంలో ప్రాణహిత నదిలో టేకు కలప పట్టుపడటమే దీనికి నిదర్శనం. అలాగే ప్రాణహితలో ప్రవాహం తగ్గుముఖం పట్టి నప్పుడల్లా రెండు రాష్ట్రాల నడుమ మావోల కార్యకలాపాలు ఊపందుకుంటుండటంతో దాన్ని అరికట్టేందుకు ఆయా శాఖల ఉన్నతాధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో పోలీసుశాఖ గతంలోనే చెక్ పోస్టులు ఏర్పాటుచేసి, నిఘా ముమ్మరం చేయగా, అటవీశాఖ కూడా ఆ దిశగా పయనించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

మాజీ జడ్పీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : హాజీపూర్ తాజా మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శిల్పాశ్రీనివాసరావును మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదివారం పరామర్శించారు. శిల్పాశ్రీనివాసరావు ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ సమావేశం

జన్నారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జన్నారంలోని పైడిపల్లి గార్డెన్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ 320జీ రీజియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జన్నారం ఎస్‌ఐ రాజవర్ధన్ హాజరై మాట్లాడారు. సమాజంలో లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలు గొప్పవని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ లయన్స్‌క్లబ్‌లకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు రజిత, హన్మంతరావు, రాజన్న, భూమేష్, సతీష్, సందీప్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జన్నారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఏబీసీడీ వర్గీకరణకు ఆమోదం తెలిపినందుకు హర్షిస్తూ ఆదివారం జన్నారంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎస్సీ సెల్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఏబీసీడీ వర్గీకరణతో బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ ఆలీ, నాయకులు పసి వుల్లా, ఇందయ్య, ప్రశాంత్, ప్రవీణ్, రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా వరసిద్ధి వినాయక కల్యాణం..

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



మహాయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

నస్పూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలో జరుగుతున్న శ్రీ వైష్ణవ అయుత చండీ అతిరుద్రం, విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా ఆదివారం సా యంత్రం గణపతికి లక్ష గరికార్చన, సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. కృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరపానంద స్వామీజీ ఆధ్వర్యంలో మహాయాగ కార్య క్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం గణపతి పూజ, లక్ష్మి గణపతి, ప్రధాన కలశ స్థాపన, అగ్ని మథన, ధ్వజారోహణం, సూర్య హోమాలు నిర్వహించారు. సోమవారం శ్రీ రుద్ర సహిత మృత్యుంజయ హోమం, సాయంత్రం సహస్ర జ్యోతిర్లింగార్చన, రుద్ర క్రమార్చన పూజలు జరుగనున్నాయి. ఆదివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, తనయుడు కొక్కిరాల ఉదయ్ చరణ్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సదర్భంగా స్వామీజీ వారికి ఆశీస్సులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. మహా యాగ పూజలు ఇక్కడ నిర్వహించడం ఆనందదాయకమని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే అన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో వేదపండితులు, భక్తులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ దివ్యదర్శన నిలయం ప్రారంభం



మాట్లాడుతున్న కుల్దీప్‌జీ

మంచిర్యాల కలెక్టరేట్/గర్మిళ్ల ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని హైటెక్ సిటీలో బ్రహ్మకుమారీస్ దివ్యదర్శన నిలయాన్ని ఆదివారం ప్రారంభించారు. దీనికి అతిథులుగా శాంతి సరోవరం నుంచి కుల్దీప్‌జీ మంచిర్యాల ఇన్‌చార్జి బ్రహ్మక్కయ్య, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కొక్కిరాల సురేఖ, హైటెక్ సిటీ కౌన్సిలర్ చైతన్య, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్, బీజేపీ నాయకులు రఘునాథ్‌రావు వెరబెల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుల్దీప్‌జీ మాట్లాడుతూ విశ్వంలో ఎన్నో సమస్యలతో అనేక మంది సతమతమవుతున్నారని, ఇలాంటి సమయంలో దివ్య దర్శన నిలయాన్ని మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భూదాత మంగీలాల్ సోమాని, మోహన్, రమక్కయ్య, హేమలత పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకురాలు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టిన ఛలో హైద్రాబాద్ కార్యక్రమం పోస్టర్లను ఆదివారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి అరుణ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు అటకెక్కాయన్నారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. ఛలో హైద్రాబాద్‌కు పెద్ద సంఖ్యలో అందరు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు అందె మంగ, నాయకురాల్లు ప్రవళిక, అనూష, లక్ష్మీ, శకుంతల, సుశీల, మల్లమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

అవార్డులు సాధించిన నృత్య కళాకారులు



అవార్డులు సాధించిన కళాకారిణులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఆదివారం ఫైడ్ ఇండియా కల్చరల్స్ అండ్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంచిర్యాలకు చెందిన స్నేహఫౌండేషన్ కళాకారులు 31 మంది అయోధ్య రామ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డులను పొందారు. అవార్డులు పొందిన కళాకారులను ఫౌండేషన్ గురువు డాక్టర్ చిదానందకుమారి అభినందించారు.

వంద కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వంద కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఆర్ క్యాంటీన్‌ను ఆదివారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాను గెలిచిన 14 నెలల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో అభివృద్ధిపనులు శర వేగంగా జరు గుతున్నాయన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే అమృత్ స్కీం కింద క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీల్లో రూ. 40 కోట్ల తో పనులు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే క్యాటీన్ నిర్వహకులు ప్రయాణికులకు, ప్రజలకు రుచి కరమైన అల్పాహారం అందించాలన్నారు.

అలాగే ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, మంద తిరుమల్, గుడ్ల రమేష్, పైడిమల్ల నర్సింగ్, జావేద్, ఇసాక్, అర్జున్ కుమార్, సంగి సంతోష్ పాల్గొన్నారు. అనంతరం పాత బస్టాండ్‌లోని ఓ మెడికల్ షాపును ప్రారంభించారు. మందులను కొనుగోలు చేశారు. ఎమ్మెల్యేను వారు ఘనంగా సన్మానించారు. రాచర్ల గణేష్, రవి, మహేందర్ పాల్గొన్నారు.

పేదలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం...

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్

నస్పూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల వికాసం కాకుండా కార్పొరేట్ కంపెనీల వికాసం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని, తద్వారా ప్రజలను విస్మరించి పాలన సాగిస్తుందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ఆరోపించారు. నస్పూర్ కాలనీలోని నర్సయ్య భవన్ లో ఆదివారం మంచిర్యాల నియోజక వర్గ జనరల్ బాడీ సమావేశం పట్టణ అధ్యక్షుడు జోగుల మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనా శంకర్ మాట్లాడుతూ సీపీఐ పార్టీ వందేళ్ల స్ఫూర్తితో కార్మిక రాజ్య స్థాపనకు పోరాటం చేయాలన్నారు. పార్టీ ఆవిర్భావించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతజయంతి ఉత్సవాలను నిర్వహించుకుంటున్నామన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి అనేక ఉద్యమాలను, కార్మిక వర్గ హక్కుల సాధనకు పోరాటాలు నిర్వహించిన ఘనత సీపీఐకి దక్కు తుందన్నారు. ప్రజా ఉద్యమాలను ఊపిరిగా పని చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. దేశంలో సమానత్వం ఉండకుండా రాజ్యాంగ మౌళిక సూత్రాలు మార్చాలని బీజేపీ కుట్రలు చేసిందని విమర్శించారు. బడా వ్యాపార వేత్తలకు కొమ్ముకాస్తున్న బీజేపీకి గుణపాఠం చెప్పా లన్నారు. మతాల మధ్య కులాల మధ్య చిచ్చుపెట్టి మతతత్వ రాజకీ యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్‌సీడబ్ల్యూయు అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ జిల్లా అధ్యక్షుడు రామడుగు లక్ష్మన్, నాయకులు మేకల దా సు, రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేష్, మిర్యాల రాజేశ్వర్ రావు, ముస్కె సమ్మయ్య, బాజీసైదా, కిషన్ రావు, దేవి పోచన్న, రవీందర్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే డిస్ట్రిబ్యూటరీ కాలువలోకే

- వంతెన కల్వర్టు చుట్టూ రక్షణ దిమ్మెలు కరువు



నెల్కివెంకటాపూర్‌లో డిస్ట్రిబ్యూటరీ కాలువకు ఇరువైపుల రక్షణ లేని దిమ్మెలు

దండేపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్ గ్రామ సమీపంలో వందూర్‌గూడ వెళ్లే బీటి రోడ్డుకు ఆనుకుని ఉన్న 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ వంతెన వద్ద రక్షణ దిమ్మెలు లేక ప్రమాదకరంగా మారింది. దీంతో ఎవరైనా ఆదమరిస్తే కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. ప్రతీ నిత్యం ఈ రోడ్డు గుండా అనేక వాహనాలు వెలుతుంటాయి. ఏ కొంచెం ఆదమరిచినా కాల్వలో పడిపోవడం కాయం. ఏప్ర మాదం జరుగక ముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి డిస్ట్రిబ్యూటరీ కాలువ రోడ్డుకు ఇరువైపు రక్షణ గోడలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు, గిరిజనులు, స్థానికులు కోరుతున్నారు.

సోలార్ కంచె.. నిలువరించె..

- కాపలా లేకున్నా పంటలకు రక్షణ
- తప్పిన అటవీ జంతువుల బెడద

6

ఇంద్రజాలంలో దిట్ట...

- ఆకట్టుకుంటున్న ప్రదర్శనలు
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందుకుంటున్న సాయికృష్ణ

7

ఆదివాసీ నాయకపోడ్‌ల అభివృద్ధికి కృషి

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



వాలీబాల్ విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ నాయకపోడ్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని చెన్నూరు ఎమ్మె ల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలో ఆదివారం గాంధారిఖిలా జాతరలో పాల్గొన్నారు. దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గాంధారిఖిలా టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. నాయ కపోడ్ సంఘం భవనానికి రూ. 20 లక్షల నిధులను, పదిగుంటల భూమిని కేటాయిస్తానని పేర్కొన్నారు. ఆదివాసీ నాయకపోడ్‌లు అందరు ఒక్కతాటిపై ఉండి ప్రభుత్వానికి సమస్యల ను నివేదించాలన్నారు. చెన్నూరు నియోజక వర్గంలోని క్యాతనపల్లి, మందమర్రి, చెన్నూరు మున్సిపాలిటీల్లో వంద కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిం చేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధికోసం ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నానన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో 40 కోట్ల రూపాయలతో మంచినీటి నీటిట్యాంకులను నిర్మిస్తున్నామని, నీటిఎద్దడి ఉండదని తెలిపారు. మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించేందుకు కృషి చేస్తున్నానన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎన్నికలు జరిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడ్ సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. జాతర సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించగా విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర నాయకులు పల్లె సత్యనారాయణ, రాంచందర్, గంజి రాజన్న, జిల్లా అధ్యక్షులు పెద్ది భార్గవ్,లౌడం రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదివాసీ నాయకపోడ్‌లను అన్ని విధాలుగా ఆదుకోవాలని పేర్కొన్నారు. నాయబ్ తహసీల్దార్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి విద్యాలత, మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్‌ఐలు రాజశేఖర్, రాజశేఖర్, ఆర్‌ఐ గణపతి జాతరను పర్యవేక్షించారు.

- జాతరకు పోటెత్తిన భక్తులు

గాంధారిఖిలా మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటె త్తారు. తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో జాతరను పర్యవేక్షించారు. మంచిర్యాల ఆర్డీవో శ్రీనివా సరావు కుటుంబ సమేతంగా మైసమ్మతల్లినిదర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మైసమ్మతల్లికి బోనాలను సమర్పించారు. భక్తులు మైసమ్మతల్లికి కోళ్లు, మేకలను బలిచ్చారు. చెట్లకింద విందు బోజనాలను చేశారు. ఆదివాసీ నాయక పోడ్ సేవాసంఘం నాయకులు, జాతర కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.



గాంధారిఖిల్లా జాతరలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు

భోజనంలో మెనూ పాటించేలా చర్యలు

- శివచరణ్‌కుమార్, వాంకిడి ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : మండలంలో మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించేందుకు తీసుకుంటు న్న చర్యలు ఏంటి?

ఎంఈవో : మండలంలో మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలను సందర్శించి సిబ్బందికి సూచనలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేస్తున్నారు?

ఎంఈవో : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను పకడ్బందీ ప్రణాళికతో సన్నద్ధం చేస్తున్నాం. ఉదయం సాయంత్రం రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. మరుసటి రోజు టెస్టులు నిర్వహిస్తు విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : విద్యార్థులకు అల్పాహారం రోజు అందిస్తున్నారా?

ఎంఈవో : ప్రత్యేక తరగతులకు వస్తు న్న అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాం. వారు ఆర్థిక లతో ఇబ్బంది పడకుండా ప్రభుత్వ సూచ నల మేరకు అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎంత మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు?

ఎంఈవో : మండలంలో మొత్తం 358 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వాంకిడి ఉన్నత పాఠశాల నుంచి 192, ఇందాని నుంచి 16, ఖిరిడి ఉన్నత పాఠశాల నుంచి 21, కేజీబీవీ నుంచి 38, ఏహెచ్‌ఎస్ బంబార నుంచి 27, ఏహెచ్ ఎస్ నుంచి 59, గ్రీన్‌వుడ్ పాఠశాల నుంచి 5 గురు విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

- వాంకిడి, (ఆంధ్రజ్యోతి)

సోలార్ కంచె.. నిలువరించె..

- కాపలా లేకున్నా పంటలకు రక్షణ
- తప్పిన అటవీ జంతువుల బెడద
- కొనుగోలుకు రైతుల ఆసక్తి



పంట చేనుల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లేటు

కెరమెరి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అటవీ జంతువుల బారి నుంచి పంటలను రక్షించుకేందుకు రైతులు ఇబ్బంది పడేవారు. రాత్రిపూట పంట చేల వద్ద కాపలా కాసినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి దూరమైంది. సోలార్ కంచెతో పంటల రక్షణకు ఢోకా లేకుండా పోయింది. అటు అటవీ జంతువులకు ఎలాంటి హానీ లేకపోవడంతో వీటి వినియోగం పెరుగుతున్నది. వానాకాలంలో సాగు చేస్తున్న పత్తి, కంది పంటతో పాటు యాసంగిలో మొక్కజొన్న, శనగ పంటలకు అటవీ జంతువుల బెడద కొంతకాలంగా ఎక్కువైంది. అడవి పందులు, కోతులు, మనుబోతులు ఈ పంట లకు నష్టం కలిగిస్తున్నాయి. ప్రధానంగా కోతులు, అడవి పందులతో తీవ్ర నష్టం వాటి ల్లుతోంది. వీటి నుంచి పంటలను రక్షించుకునేందుకు వీలుగా సోలార్ కంచెలను రైతులు ఏర్పాటు చేసుకుంటున్నారు. కెరమెరితో పాటు గోయగాం, సావర్‌ఖేడ, సుర్దాపూర్, ఇందాపూర్, నిషాని, ఖైరి, సాంగ్వీ, కేలి(బి), కేలి(కె), ధనోర, కోటారితో పాటు అటవీ ప్రాం త గ్రామాలైన జోడేఘాట్, బాబేఝరి, పాట్నాపూర్, అనార్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో సోలార్ కంచెలు నిర్మించుకు నేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

అందుబాటులో పలు రకాల మోడళ్లు..

అడవి పందులతో పంటలను రక్షించుకునేందుకు వీలుగా సోలార్ కంపెనీలు వివిధ మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. రెండెకరాలు మొదలుకొని 20 ఎకరాలకు వరకు వినియోగించేలా వివిధ మోడళ్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చాయి. 9వేల నుంచి 15వేల రూపాయల వరకు ఆయా కంపెనీలను బట్టి లభిస్తున్నాయి. నాలుగు ఎకరాల వరకు ఉన్న పంట చుట్టూ కంచె కోసం 20వోల్ట్స్, సోలార్ ప్యానెల్, 12 ఆంప్స్(ఏహెచ్) బ్యాటరీ, ఎనర్జర్, కర్రలకు బిగించే 100 టర్నర్లు, బ్యాటరీ క్లిప్పులు మొత్తంగా సుమారు 9వేల రూపాయలకు దొరుకుతున్నాయి. నాలుగు ఎకరాల నుంచి 20 ఎకరాలకు వరకు వినియోగించేం దుకు వీలుగా 40వోల్ట్స్, సోలార్ ప్యానెల్, 32 ఆంప్స్(ఏహెచ్) బ్యాటరీ, ఎనర్జర్, కర్రలకు బిగించే 150 టర్నర్లు, బ్యాటరీ క్లిప్పులు మొత్తంగా సుమారు 15వేల రూపాయలకు దొరుకుతున్నాయి. వీటిని కొనుగోలు చేసిన రైతులు పొలాలు చుట్టూ కంచె ఏర్పాటు చేసుకుని పంటను రక్షించుకుంటున్నారు. పొలం చుట్టూ ఇనుప తీగ కర్రలకు టర్నర్ల సహాయం తో ఫెన్సింగ్‌లా కట్టుకొని సోలార్‌కు అను సంధానం చేస్తున్నారు. సోలార్ ఫెన్సింగ్‌తో అటు అటవీ జంతువుకు ప్రాణ నష్టం లేకపోవడంతో వీటి కొను గోలుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏటా తాము పడుతున్న పంటల రక్షణ తిప్పలు సోలార్ ఫెన్సింగ్‌తో తీరాయని చెబుతున్నారు.

ప్రభుత్వం సబ్సిడీపై అందజేయాలి..



ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై సోలర్ ఫెన్సింగ్ పరికరాలు అంద జేయాలి. దీంతో ఈ ప్రాంతంలో సాగు చేసిన పంటలకు అటవీ జంతువుల నుంచి ఇబ్బం దులు తొలగిపోతాయి. ఇది వరకు రాత్రి వేళ పొలం వద్దనే కాపలా ఉండేవాళ్లం. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో కాపలా తప్పింది. రైతులకు ఆర్థికంగా ఇబ్బంది కాకుండా ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తే ప్రయోజనం.

- పాలక్‌రావు, రైతు, గోయగాం

షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలోని ఎస్సీకాలనీలో ఆదివారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇడిగిరాల భీమయ్య అనే కూలీకి చెందిన పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పెంకుటింట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటల్లో ఇంట్లోని వస్తువులు, నిత్యావసర సరుకులు, దుస్తులతో పాటు 2 తులాల బంగారు ఆభరణాలు, రూ. 80 వేల నగదు, భీమయ్య కుమారుడు మహేష్‌కు సంబంధించిన డిగ్రీ సర్టిఫికెట్లు కాలి బూడిదయ్యాయి. ప్రమాద స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనతోబాధితుడు భీమయ్య కుటుంబంలో విషాదం నిండింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని భీమయ్య వేడుకున్నాడు. బాధిత కుటుంబాన్ని పలువురు పరామర్శించారు.

ఏకసభ్య కమిటీ నివేదికను సవరించాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాంకిడి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రంలో పర్యటించిన షమీం అక్తర్ ఏకసభ్య కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించిన రిపోర్టు తప్పుల తడకగా ఉందని దానిని సవరించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడారు. కమిషన్ సిద్ధం చేసిన నివేదికలో చాలా తప్పులు దొర్లాయని చెప్పారు. ఏకపక్ష నిర్ణయంతో మాల, మహార్లకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కమిషన్ ఆదిలాబాద్‌కు వచ్చిన సందర్భంగా మాదిగిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. మహార్, మాల సంఘాల నాయకులు ఇచ్చిన విన తులు పూర్తిగా స్వీకరించలేదని అన్నారు. ఫిబ్రవరి 4న అసెంబ్లీలో బిల్లుల ను ఆమోదిస్తూ సోషల్ జస్టిస్ డేగా నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని చెప్పారు. షమీం అక్తర్ నివేదిక నకలు కాపీలను దహనం చేశా రు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు హంసరాజ్, విలాస్, రోషన్, విజయ్, అరుణ్, దీపక్, డిలాజీ, మారుతి, ఇంద్రజిత్, రమేష్, నాగసేన్, ప్రదీప్, తిరుపతి, నూతన్, విఠల్, సందీప్ పాల్గొన్నారు.

అచ్చలాపూర్ పరిసర ప్రాంతాల్లో పులి సంచారం

తాండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మొన్న మాదారం రేపల్లెవా డ, నిన్న నగరం గోపాల్‌రావుపేట నేడు అచ్చలాపూర్ ప్రాంతాల్లో పులి సంచరిస్తూ అందర్ని భయభ్రాంతులకు గురి చేస్తుంది. కొద్ది రోజులుగా బెల్లంపల్లి డివిజన్ పరిధిలోని అడవుల్లో పులి సంచారం అధికమైపోయింది. కన్నాల , మాదారం, అంకుశం అడవుల్లో పులి సంచరించిన విషయం తెలిసిందే. తాజాగా తాండూర్ మండలం గోపాల్‌నగర్ గ్రామ శివారులోని అడవి గుండా అచ్చలాపూర్ ప్రాజెక్టు కొమ్ముగూడ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికా రులు నిర్ధారించారు. ఈ ప్రాంతంలో పులి పాదముద్రలను గుర్తించారు. పులి సంచారం నేపధ్యంలో రైతులు, స్థానికులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా గ్రామ శివారు ప్రాంతాల్లోకి వెళ్లవద్దని అటవీ అధికారులు సూచిస్తున్నారు.




అచ్చలాపూర్ శివారులో గుర్తించిన పులి పాదముద్ర

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మండలంలోని కొమ్ముగూడెం ప్రాంతంలో పులి సంచరిస్తుందని, ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు తెలిపా రు. కొమ్ముగూడెంలో ఆదివారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పిం చారు. అవసరం అయితేనే బయటకు వెళ్లాలని, ఒంటరిగా పొలాల వద్దకు, గ్రామశివారు ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. పులికి హానీ తలపెట్టవద్దని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలుడికి తీవ్ర గాయాలు

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం గౌతమి నగర్‌కు చెందిన రత్నం అశ్విత్‌కు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైనట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రా వు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్న భోజనం కోసం బైపాస్‌లోని బేకరీ నుంచి ఇంటికి తీసుకెళ్తుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అశ్విత్‌కు తీవ్ర గాయాల య్యాయ. మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి బాబాయ్ అగ్గూర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు.



కార్మికుల హక్కుల సాధనే ధ్యేయం



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టడమే ఐఎన్‌టీయూసీ ధ్యేయమని యూనియన్ సెక్రటరీ జనరల్ , రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి 96వ పుట్టిన రోజు వేడుకలను ఐఎన్‌టీయూసీ, దాని అనుబంధాల సంఘాల ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో ఘనంగా నిర్వహిం చారు. మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాల ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొని సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సంజీవరెడ్డి ముందుండేవాడన్నారు. ఆయన పుట్టిన రోజు అంటే కార్మికులు,నాయకులకు పండగ లాంటిదని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు ముకేష్‌గౌడ్, నాయకులు కాంపె ల్లి సమ్మయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటస్వామి, శంకర్‌రావు, అన్ని ఏరియాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలల్లో నాణ్యమైన విద్య

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ అన్నారు. సీసీసీలోని సింగరేణి పాఠశాల 47వ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అతి తక్కువ ఫీజుతో సకల సౌకర్యాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల విద్యార్థు లు వినియో గించుకోవాలని కోరారు. తాను కూడా సింగరేణి పాఠశాలలోనే చదువ ుకొని ఈ స్థాయికి వచ్చానని పేర్కొన్నారు. అనంతరం విశిష్ట అతిథి కొత్తగూడెంకు చెందిన విద్యా విభాగం కార్యదర్శి జి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు అనుకూల మైన రంగాన్ని ఎంచుకొని ఉన్నత స్థాయికి వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసుకో వాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడలు, చదువుల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ ా చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, పాఠశాల కరస్పాం డెంట్ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : అధి కారుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి అధికారుల సంఘం బాధ్యులు డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లును కోరారు. ఇందారం సంద ర్శనకు వచ్చిన ఆయనను మర్యాదపూ ర్వకంగా కలిసి సన్మానించారు. అన్ని గనుల ఏజెంట్లు, ఓసీపీల ప్రాజెక్ట్ అధికారులు, మేనేజర్లతో సమావేశం నిర్వహించి శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు ఉత్పత్తి వివ రాలను అడిగి తెలుసుకున్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు పాటుపడాలి

జైపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు పాటుపడాలని సింగరేణి డైరెక్టర్ (పీఅండ్‌పీ) కె. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఓసీపీని ఇన్‌చార్జీ జీఎం శ్రీనివాస్‌తో కలిసి పని స్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశనం చేశారు.ఈ 45 రోజులు అత్యంత కీలకమైనవని, తప్పనిసరిగా నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం ఉపరితల గనిలోకి వెళ్లి కోల్ బెంచ్‌లను , అప్‌లోడింగ్ ప్రదేశాలను పరిశీలించి ఉత్పత్తి పెంపుదల కోసం అధికారులకు సూచనలు చేశారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. వరాహా ఓబీ కాంట్రాక్టు కంపెనీకి నిర్దేశించిన రోజు వారీ లక్ష్యం సాధించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బొగ్గు ఉత్పత్తి సాధనలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఏవీరెడ్డి, గనిమేనేజర్ రవికుమార్, సేఫ్టీ అధికారి సతీష్ పాల్గొన్నార

అనుమానం పెనుభూతమై

భార్యను హత్య చేసిన భర్త



రాజకుమారి(ఫైల్)

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ 16 (ఆంధ్రజ్యోతి): అనుమానమే పెనుభూత మైంది. కట్టుకున్న భార్య వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టు కుందన్న అనుమానంతో భర్త ఆమెను హత్య చేశాడు. వివరాల్లోకి వెలితే లకావత్ రాజకు మారి(47), గణేష్ దంపతులు లక్షెట్టిపేట పట్ట ణంలోని గోదావరి రోడ్డులో నివాసం ఉంటున్నా రు. గణేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు ఆడ పిల్లలకు వివాహాలు కూడా అయ్యా యి. 15 ఏళ్లుగా గణేష్ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యను కొడుతుండేవా డు. వివాహేతర సంభందాలు అంటకడుతూ, చంపుతానంటూ వేధింపు లకు పాల్పడేవాడు. శనివారం రాత్రి ఇంటికి వచ్చిన గణేష్ తన భార్య రాజకుమారితో గొడవ పడి తీవ్రంగా కొట్టాడు. ఆదివారం తెల్లవారుజామున 3.30గంటలకు రాజకుమారి బాత్రూంకు వెళ్లింది. అది గమనించిన గణేష్ ఆమెను అనుసరిస్తూ వెనకాలే వెళ్లాడు. బాత్రూంలో ఉండగానే సిమెంటు ఇటుక, బండరాయితో భార్య తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పెద్ద ఎత్తున శబ్దం రావ డంతో ఇంట్లో ఉన్న కొడుకుతో పాటు చుట్టు పక్కల వారు వచ్చి చూశా రు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సతీష్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజకుమారి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం.

రెండు బైక్‌లు ఢీ : యువకుడి మృతి



చుక్కయ్య(ఫైల్)

రెబ్బెన, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం రాళ్లపేట శివారులో ఆదివారం జరి గిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడిక క్కడే మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలి పిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండలం గంగా పూర్ గ్రామానికి చెందిన నగేశ చుక్కయ్య(39) అనే యువకుడు భార్య మాధవితో కలిసి ద్విచక్ర వాహనంపై గంగాపూర్ నుంచి కాగజ్‌నగర్‌లోని తన అన్న కూతురి ఇంటికి వెళ్లుతున్నాడు. అదే సమయం రాళ్లపేట గ్రామానికి చెందిన లచ్చన్న(22) వంకులం నుంచి రాళ్లపేటకు బైక్‌పై అతి వేగంగా అజాగ్ర తగా వచ్చారు. దీంతో ఎదురెదురుగా బైక్‌లు ఢీ కొన్నాయి. కింద పడిన చుక్కయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మాధవి, లచ్చన్నకు గాయాలయ్యాయి. వీరిని 108లో వారిని కాగజ్‌నగర్ ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. లచ్చన్న పరిస్థితి విష మంగా ఉండడంతోమెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు..

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణపూర్‌లోని నేషనల్ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు ఓంకార్ (32) మృతిచెందాడు. రామకృష్ణపూర్ ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి నుంచి ఓంకార్‌తో పాటు మరో ఇద్దరు సింగరేణి కార్మికులు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో శ్రీరాంపూర్ బొక్కల గుట్ట మధ్యలోకి రాగానే కారు అదుపు తప్పడంతో కారులో ప్రయాణిస్తున్న ఓంకార్‌కు తీవ్ర గాయాలై మృతిచెందాడు.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు.. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు దాటుతుండగా మహిళకు గాయాలు

తాండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహి ళకు గాయాలయ్యాయి. ఆకుల కళావతి అనే మహిళ రోడ్డు దాటు తుండగా తాండూర్ వైపు నుంచి రెబ్బెన వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. దీంతో కళావతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది శ్రీనివాస్, శివకృష్ణ ఈ సందర్భంగా తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామ శివారులో పేకాట శిబిరంపై ఆదివారం ఆసిఫాబాద్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ రవీందర్‌కు వచ్చిన సమాచారం మేరకు ఆసిఫాబాద్ ఎస్సై తన పోలీసు సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం సాలెగూడ గ్రామ శివారులో నిర్వహి స్తున్న పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురి అదుపులోకి తీసుకున్నా రు. వారి నుంచి 3,020 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలంలోని బాబాసాగర్, డబ్బా గ్రామ శివారు రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ మేరకు 16 మంది పేకాట రాయుళ్లను అదపులోకి తీసుకుని వారి నుంచి రూ.4500 నగదు స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్ పోస్టు వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఆసిఫాబాద్ సీఐ రవీందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పెద్దవాగు, చిలాటిగూడ వాగుల నుంచి అనుమతులు లేకుండా అక్రమం గా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించామని సీఐ తెలి పారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బెజ్జూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని ఎన్‌ఫోర్స్ మెంట్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో వేర్వేరు చోట్ల 11.30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కుకుడ గ్రామంలోని ఒకరి ఇంటి వెనకాల పత్తి చేనులో పాడు బడ్డ బాతురూంలో నిల్వ చేసిన 6.30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కాగా నిలువ ఉంచిన రేషన్ బియ్యం ఎవరివి అనేది ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం బెజ్జూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని సోమిని గ్రామానికి చెందిన బోగ మొండయ్య ఇంట్లో పక్కా సమాచారం మేరకు తనిఖీలు చేశారు. మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్య పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన బియ్యంను స్వాధీన పర్చుకొని మొండయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం..

- పట్టించుకోని అధికారులు

భీమారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లి గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. అధికారులు పారిశుధ్య పనులు చేయించకపోవడంతో నాలాల్లో మురుగునీరు, చెత్తా, చెదారం పేరుకు పోయింది. పారిశుధ్యపనులు చేపట్టకపోవడంతో దోమలు పెరిగి అనారోగ్యం బారినపడుతున్నామనిప్రజలు పేర్కొంటున్నారు. బోర్‌వెల్ వద్ద శుభ్రంగా లేకపోవడంతో నీరు కలుషితం అయ్యేప్రమాదం ఉందని, దీంతో రోగాలు వచ్చేఅవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. రోజుల తరబడి చెత్తాచెదారం పేరుకుపోతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్‌పౌడర్ చల్లాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని, వ్యాధుల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు

100శాతానికి పైగా లక్ష్యం చేరుకున్నాం

శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారి, శ్రీరాంపూర్ ఓసీపీ



శ్రీరాంపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు ఉత్పత్తిలో 100శాతానికి పైగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నామని శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి టి. శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : శ్రీరాంపూర్ ఓసీపీ జీవితకాలం ఎంత ? ఎన్ని టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి ?

ప్రాజెక్ట్ అధికారి : జీవితకాలం 16 సంవత్సరాలు, 55 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : ఉత్పత్తి లక్ష్యం ఎంత ? ఎంత సాధించారు ?

ప్రాజెక్ట్ అధికారి : 32 లక్షల టన్నుల లక్ష్యం కాగా, 28.7 లక్షల టన్నులు సాధించాం.

ఆంధ్రజ్యోతి : భూమి సేకరణ కొనసాగుతోందా ?

ప్రాజెక్ట్ అధికారి : 162.5 హెక్టార్ల అటవీ భూమి అవసరం ఉంది. 10 హెక్టార్లకు అటవీశాఖ నుంచి సర్టిఫికెట్ రావాలి.

ఆంధ్రజ్యోతి : ఓసీపీ విస్తరణతో రాజీవ్‌రహదారికి ప్రమాదం ఉందా ?

ప్రాజెక్ట్ అధికారి : లేదు. 300 మీటర్ల లోపలే పనులు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ప్రైవేటు ఓబీ కంపెనీలు ఎన్ని ? ఎంత ఓబీ తీస్తున్నాయి ?

ప్రాజెక్ట్ అధికారి : రెండు. జీవీఆర్ లక్ష్యం 163 లక్షల క్యూబిక్ మీటర్లు కాగా, 143 లక్షల క్యూబిక్ మీటర్లు సాధించింది. సీఆర్ఆర్ లక్ష్యం 358 లక్షల క్యూబిక్ మీటర్లు కాగా, 250 లక్షల క్యూబిక్ మీటర్లు తీసింది.

ఇంద్రజాలంలో దిట్ట...

- ఆకట్టుకుంటున్న ప్రదర్శనలు
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందుకుంటున్న సాయికృష్ణ





మ్యాజిక్ చేస్తున్న సాయికృష్ణ

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సామాజిక చైతన్యమే లక్ష్యంగా ఓ యువకుడు తన ఇంద్రజాల ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాడు. మూఢనమ్మకాల నుంచి ప్రజలు మేలుకునేలా తన ప్రదర్శనలను ప్రదర్శిస్తున్నారు. విద్యార్థి దశనుంచే ఇంద్రజాలంపై ఆసక్తి పెంచుకున్న ఆయన జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకుంటున్నారు. వేలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖుల ప్రశంసలను సైతం అందుకున్నాడు. మందమర్రి పట్టణంలోని మార్కెట్ ఏరియాకు చెందిన వడ్డేపల్లి సాయికృష్ణ తన చిన్నతనం నుంచే ఇంద్రజాలంపై ఆసక్తిని పెంచుకుని మ్యాజిక్‌పై మక్కువ పెంచుకున్నాడు. మంచి మెజీషియన్ కావాలని పట్టుదలతో సాధన చేశాడు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడం, ఆయన మరణం తర్వాత వచ్చిన వారసత్వ ఉద్యోగాన్ని కూడా వదులుకున్నాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అమెరికా తదతర దేశాల్లో కూడా ఇంద్రజాల ప్రదర్శనలు నిర్వహించాడు. ఆయన ప్రదర్శనలో మంటల నుంచి మహిళలను సృష్టించడం, ఎలాంటి ఆధారం లేకుండా గాలిలో మనుషులు తేలియాడేలా చేయడం, మనుషులను ముక్కలుగా చేసి అదృశ్యం చేయడం, గాలి నుంచి పావురాళ్లు, కుందేళ్లతో పాటు గొడుగులను సృష్టించడం ఆయన ప్రత్యేకత. నీడలను నిజమైన మనుషులుగా మారుస్తాడు. కాగితాలను కరెన్సీ నోట్లుగా మార్చడం ఆయన ప్రతిభ అని చెప్పవచ్చు. ఇప్పటి వరకు దాదాపు 3 వేలకు పైగా ప్రదర్శనలు కూడా ఇచ్చాడు.



అవార్డు అందుకుంటున్న వడ్డేపల్లి సాయికృష్ణ

సాధించిన అవార్డులు

2018లో ఇనేవేషియా ఇంటర్నేషనల్ ఎక్సెలన్సీ అవార్డును అందుకున్నారు. 2018లో ఢిల్లీలో జాతీయ కళా రత్న అవార్డు అందుకున్నాడు. 2019లో హరిహర కళా భవన్‌లో మయూర ఆర్ట్స్ వారు నిర్వహించిన కార్యక్రమంలో గోల్డెన్ టాలెంట్ అవార్డుతో పాటు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సాధించాడు. 2023లో హైద్రాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో పదవ వరల్డ్ రికార్డులో స్థానం పొందాడు. 2024లో ఇంద్రజాల ప్రవీణ అవార్డును అందుకున్నారు. హైద్రాబాద్ ఆదర్శ కళానిలయం వారి చేత స్వర్ణ నంది అవార్డును అందుకున్నారు. అలాగే విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రదర్శనలు ఇస్తూ విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పిస్తున్నాడు. ఆయన ఇంటి పేరు వడ్డేపల్లి పోయి మెజీషియన్ సాయికృష్ణగా పిలుస్తున్నారు. విదేశాల్లో సైతం ప్రదర్శనలు ఇస్తూ మన్ననలు పొందుతున్నాడు. ఆయన చేసే ప్రదర్శనలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి వీక్షిస్తుంటారు.

ప్రజా చైతన్యమే లక్ష్యంగా ప్రదర్శనలు

ప్రజా చైతన్యమే లక్ష్యంగా ప్రదర్శనలు చేస్తున్నాను. ఇప్పటి వరకు దాదాపు 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. ప్రతి ఒక్కరిలో ఒక టాలెంట్ ఉంటుంది. దాన్ని బయటకు తీయడం ద్వారా గుర్తింపు పొందుతారు. నా తండ్రి చనిపోయిన తర్వాత వారసత్వంగా వచ్చిన ఉద్యోగాన్ని వదులుకుని మెజీషియన్‌పై పూర్తి దృష్టి సారించి సక్సెస్ అయ్యాను. ఎక్కడకు వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది. నా ప్రదర్శనలతో ప్రజలు ఆనందపడుతున్నారు. ఇంద్రజాలానికి ఎంతో చరిత్ర ఉంది. దీనిపై పట్టు సాధిస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. అందుకే అనేక అవార్డులను అందుకున్నారు.

- సాయికృష్ణ, మెజిషియన్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 1993-96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుతం కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు చదువుపై సూచనలు చేశారు. పెన్నులు, ఇతర విద్యా సామగ్రి అందించారు. అనంతరం కాలేజీ హాస్టల్ ముందు మొక్కలు నాటారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోయ తిరుపతి, వేణుగోపాలస్వామి, కరీముల్లాఖాన్, శ్రీరామ్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పట్టభద్రుల ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిదే విజయం

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయం ఖాయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. ఆదివారం మందమర్రిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలే ఎమ్మెల్సీ విజయానికి దోహదపడతాయన్నారు. తమ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన సేవలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అభ్యర్థిగా ప్రకటించిందన్నారు. మరో రెండు రోజుల్లో చెన్నూరులో పట్టభద్రుల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విద్యావంతులు ఆలోచించి నరేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నోముల ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, గుడ్ల రమేష్, మంద తిరుమల్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

వేమనపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని జక్కెపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పొర్తెటి అనిల్‌కుమార్‌ను ఆదివారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. అనిల్ కుమార్ సంవత్సరం కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని ఇటీవల గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అనిల్‌కుమార్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్ తల్లిదండ్రులు కాంతారావు, సంధ్య, గ్రామస్తులు శంకర్, కిష్టయ్య, తరుణ్, జయారం, రాజం పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న వాకర్స్ సభ్యులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు అల్పాహారం పంపిణీ చేశారు. భవన నిర్మాణ కూలీలు, ప్రయాణికులు, నిరుపేదలకు 300 మందికి పైగా అల్పాహారం పంపిణీ చేశామని వాకర్స్ సభ్యులు తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 8 గంటలకు అల్పాహారం పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు నాగేష్‌కుమార్, జయరాంయాదవ్, శ్రీనివాస్, సత్తయ్య, శ్రీనివాస్, లింగయ్య, కనకయ్యగౌడ్ , శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

పేర్ల నమోదుకు మరో అవకాశం

కాసిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వేలో పేర్లు నమోదు కాని వారి కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు ఎంపీడీవో సత్యనారాయణసింగ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సర్వేలో పేర్లు నమోదు కాని వారు సర్వే ఫారాలను తీసుకుని కుటుంబీకుల ఆధార్ కార్డులతో మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ నెల 16 నుంచి 28 వరకు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పేర్లను నమోదు చేయడం జరుగుతుందన్నారు.

సంత్ సేవాలాల్ సేవలు చిరస్మరణీయం

చెన్నూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం చెన్నూరు పట్టణంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలని సూచించారు. ఈ సందర్భంగా సేవాలాల్‌సభ్యులు కొత్త బస్టాండ్ నుంచి గాంధీ చౌక్ వరకు సంప్రదాయబద్ధంగా ర్యాలీ నిర్వహించారు. సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నెన్నెల: తపస్వీ సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ అడుగుజాడల్లో బంజారాలు నడవాలని మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్ అన్నారు. ఆదివారం చిన్న లంబాడితండాలో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవలాల్ బంజారాలను సన్మార్గంలో నడిపించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. సాంఘీక అనచితేతకు వ్యతిరేకంగా పోరాడారని, బంజారా జాతి మూఢనమ్మకాలకు దూరంగా ఉండేలా ముందుకు నడిపించారన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ మెంబర్ గట్టు బాణేష్, బంజారా నాయకులు ధరవత్ విజయ్, జాటోత్ మంగీలాల్, పాల్యా శ్రీనివాస్, జాటోత్ రవి, రాకేష్, వెంకటి, రాజేష్, శేష పాల్గొన్నారు.

భీమారం : మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన, భజరం గ్‌దళ్ యువత ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహించారు. కాటారాం, బూరుగుపల్లి జట్టు తలపడగా కాటారం విజేతగా నిలిచింది. విజేతకు రూ. 15 వేలు, రన్నర్ జట్టుకు రూ. 10 వేలను ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ భుక్య రాజ్‌కుమార్‌నాయక్, శ్రీనివాస్, అరవింద్, సురేష్‌ల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు రమాదేవి, బీఆర్ ఎస్‌వీ మండల అధ్యక్షుడు భుక్య రాజేష్ నాయక్, లక్ష్మణ్, బాబర్‌ఖాన్, బలరాంనాయక్, రాజునాయక్, గుగులోత్ శేఖర్, మనోజ్, వంశీ పాల్గొన్నారు.



చెన్నూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

సందేహాలు తీరుస్తూ...పరీక్షలకు సిద్ధం చేస్తూ..

వసతి గృహ విద్యార్థులకు ఎస్ఐ తరగతుల నిర్వహణ

కోటపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులు మరో వైపు విద్యార్థుల చదువుల పట్ల సైతం ఆసక్తి కనబరుస్తూ వారు పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రోత్సహిస్తున్నారు. చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్ పది రోజులుగా కోటపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహ పదవ తరగతి విద్యార్థులకు రాత్రివేళ తరగతులు నిర్వహిస్తున్నారు. ఎస్ఐ రాజేందర్ అయితే ప్రతి రోజు రాత్రి 7.30 గంటల నుంచి 9 గంటల వరకు వసతి గృహంలోనే విద్యార్థుల మధ్య ఉంటూ వారి సదేహాలను నివృత్తి చేస్తున్నారు. పదవ తరగతి చదివే విద్యార్థులు వసతి గృహంలో 20 మంది ఉండగా రాత్రివేళ గంటన్నర పాటు విద్యార్థులకు స్టడీ అవర్ చేపట్టారు. ఎలా చదివితే ఉత్తీర్ణులు, ఎక్కువ మార్కులు సాధించాలంటే ఎలా చదవాలనే దానిపై సలహాలు ఇస్తున్నారు. పైగా ఎస్ఐ రాజేందర్ గణితంలో దిట్ట కావడంతో విద్యార్థులకు లెక్కలపై తర్ఫీదు ఇస్తూ సందేహాలు తీరుస్తున్నారు. తాను గురుకుల విద్యార్థినేని, హాస్టల్ కష్టాలతో పాటు పేద విద్యార్థుల ఇబ్బందులు తనకు తెలుసని పరీక్షల వేళ భయం పోగొట్టేందుకు విద్యార్థులతో మేమకమవుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ ప్రతినిత్యం వసతి గృహానికి రావడంతో చదువుపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నామని సార్ చెప్పినట్లు ప్రణాళిక ప్రకారం చదువుతున్నామని విద్యార్థులు అంటున్నారు.



విద్యార్థులకు స్టడీ అవర్ నిర్వహిస్తున్న ఎస్ఐ రాజేందర్

నేడు పేరెంట్స్ కమిటీ సమావేశం

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఉదయం 11 గంటలకు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, పేరెంట్స్ కమిటీ కో ఆర్డనేటర్ గజెల్లి మోహన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 9959269975లో సంప్రదించాలన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తాండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లో ఆదివారం మణి క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ కుమారస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. పోటీల్లో తాండూర్, తిర్యాణి, రెబ్బెన మండలాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. ఈ నెల 28న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో రాంచందర్, దత్తు, మహేందర్‌రావు, శేఖర్, అనిల్ కుమార్, రాహుల్, ప్రమోద్, క్రాంతి, రమేష్, తిరుపతి, పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

చెన్నూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సమీపిస్తున్న సందర్భంగా మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. స్వామి వారిని దర్శించుకునిమొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు పోసి నైవేద్యాలను సమర్పించారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు.

అక్రమ రవాణాకు చెక్ పడేనా..?

(5వ పేజీ తరువాయి)

వివిధ రకాల వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. రోజుకు సగటున ఒక్కో వాహనానికి రూ. 50 చొప్పున వసూలు చేసినా, కనీసం రూ. 10వేలు వసూలు అయ్యే అవకాశం ఉంది. నెల తిరిగే సరికి రూ. 3 లక్షల పై చిలుకు నిధులు సమకూరే అవకాశం ఉంది. అంత పెద్ద మొత్తంలో పన్ను వసూలు చేసేందుకు రంగం సిద్ధమైనప్పటికీ అంత రాష్ట్ర వంతెనపై నుంచి జరుగుతున్న అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పటిష్ట నిఘా ఏర్పాటు..

అటవీ టోల్‌గేట్ల నుంచి పయనించే వాహనాలపై సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా ఉంచేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. రెండు చెక్ పోస్టులలో బీట్, సెక్షన్ ఆఫీసర్ల స్థాయి అధికారులు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తుండగా, వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా...వంతెన ద్వారా రెండు రాష్ట్రాల నడుమ రవాణా సౌకర్యం మెరుగుపడింది. ముఖ్యంగా మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంత వాసులు తమ అవసరాలకు అంతరాష్ట్ర వంతెనపై నుంచి తెంగాణలోని మంచిర్యాల, కరీంనగర్ లాంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పుడు అటవీశాఖ ప్రత్యేకంగా టోల్‌గేట్లు ఏర్పాటు చేసి చెస్ వసూలు చేసేందుకు సిద్ధపడుతుండటంతో వాహనాల పై భారం పడే అవకాశం ఉంది.

స్థానిక వాహనాలకు మినహాయింపునిస్తున్నాం..

చెన్నూరు అటవీ రేంజ్ అధికారి శివకుమార్



అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే చెక్ పోస్టుల ద్వారా స్థానిక వాహనదారులకు మినహాయింపునిస్తున్నాం. చెన్నూరు ప్రాంత వాసులు చెక్ పోస్టుల గుండా ప్రయాణిస్తే వారికి పన్ను వసూలు చేయబోము. ఇందు కోసం స్థానిక వాహనాలను గుర్తించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అంతరాష్ట్ర వంతెనపై నుంచి రవాణా సాగించే భారీ వాహనాలు, వ్యాపార సంబంధిత రవాణాపై మాత్రమే పన్ను విధించే అవకాశాలు ఉన్నాయి. స్థానికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



గణపతి ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

నస్పూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో ఆదివారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రధానార్చకులు వంశీ కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు ఆలయానికి చేరుకుని 108 ప్రదక్షణలు చేశారు. ఆలయ అవరణలో గణపతి హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి మహా హరిద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పుర వీధుల్లో పల్లకి సేవా నిర్వహించారు. తగిన ఏర్పాట్లు చేసామని ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు తెలిపారు.


గ్రామాల్లో బీజేపీ ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కోటపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పారుపెల్లి, పిన్నారం గ్రామాల్లో ఆదివారం బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బత్తుల సమ్మయ్యతో పాటు పలువురు నాయకులు ముందుగా పారుపెల్లి లోని కాల భైరవ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పట్టభద్రులను కలుస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి వేయాలని కోరారు. పార్టీ మండల ఇన్‌చార్జి నాగేశ్వర్ రావు, మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, ఉపాధ్యక్షుడు పెద్దింటి పున్నంచంద్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినోద్ పరామర్శ



రామ్‌చందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామ్‌చందర్‌ను ఆదివారం పాత మంచిర్యాలలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరామర్శించారు. రామ్‌చందర్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఎస్‌జీటీగా ఎంపిక



డీఈవో నుంచి నియామక పత్రం అందుకుంటున్న హరికృష్ణారెడ్డి

కోటపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలలో గంటల ప్రతిపాదికన తాత్కాలిక ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హరికృష్ణరెడ్డి ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఇటీవల పోస్టింగ్‌లు ఇవ్వగా ఆయన ఎస్‌జీటీగా ఎంపిక కావడంతో డీఈవో లలిత నుంచి నియామకపత్రం అందుకున్నారు. భీమారం ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడిగా నియమించారు. హరికృష్ణరెడ్డిని ప్రిన్సిపాల్ రాజశేఖర్, మాజీ ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి అభినందించారు.



ఎంపీ నిధులతో రోడ్ల పనులు

జైనూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామాల్లో ఆదిలా బాద్ ఎంపీ గోడాం నగేష్ తన కోటా కింద మంజూరు చేసిన నిధులతో రోడ్ల పనులు కొనసాగుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు మేస్రాం జ్ఞానేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండ లంలోని కొన్ని గ్రామాల్లో రోడ్లు సక్రమంగా లేవని ఎంపీకి సమస్యను తెలియజేశామని అన్నారు. దీంతో ఎంపీ నగేష్ స్పందించి తన కోటా కింద సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు సుబోధ్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గంతోనే ప్రశాంతత

లింగాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భక్తి మార్గంతోనే ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని ఏల్లాపటార్ గ్రామంలో ఆదివారం హనుమాన్ ఆలయ వార్షికోత్సవం సంద ర్భంగా ఆమె హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భం గా అన్నదానం చేసిన ముస్లిం వ్యక్తి అబ్దుల్ రహేమాన్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఇసాంబర్ సేట్, లక్యానాయక్, కిషన్, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు పాండురంగ్, భానుదాస్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

పెంచికలపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి తాము నిరంతరం పోరాటం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ అన్నారు. పెంచికలపేట మండలంలోని పదో తరగతి విద్యార్థులకు మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యల పరిష్కారానికి అనునిత్యం పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రవీణ్, తేజస్విని, నిఖిల తదితరులు పాల్గొన్నారు.

నీలుగాయిని కాపాడిన అధికారులు

వాంకిడి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అడ ప్రాజెక్టు కాలువలో పడిపోయిన నీలుగాయిని అధికారులు కాపాడారు. వాంకిడి మండలంలోని సరండి గ్రామ శివారులోని అడ ప్రాజెక్టు కాలువలో ఆదివారం ఉదయం నీలుగాయి ప్రమాదవశాత్తు పడింది. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా గమనించిన స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. వాంకిడి ఎఫ్ఎస్‌వో మల్లయ్య, రాంమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని కాలువలో పడి ఉన్న నీలుగాయిని బయటకు తీసి అటవీ ప్రాంతంలో వదిలి వేశారు. కాలువలో పడి ఉన్న నీలుగాయిని ప్రాణాలతో కాపాడినందుకు ఎఫ్ఆర్వో గోవింద్ చంద్ సర్దార్ అటవీ శాఖ సిబ్బందిని అభినందించారు. గ్రామస్థులు వన్యప్రాణులకు ఇబ్బంది కలిగేలా చేయొద్దని, అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆటలకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా సామగ్రి లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. కొందరిలో వివిధ ఆటల్లో ప్రతిభ ఉన్నా తగిన సాధన లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం దీన్ని గుర్తించి పాఠశాలలకు ఇటీవల నిధులు మంజూరు చేసింది. అవసరమైన క్రీడా సామగ్రి కొనుగోలకు ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకాలు విడుదల చేసింది.



పాఠశాలల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు(ఫైల్)



- ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా పరికరాల కొనుగోలుకు నిధులు
- కుమరం భీం జిల్లాకు రూ. 2.17 కోట్లు మంజూరు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయింపు
- ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకాలు విడుదల

పెంచికలపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా క్రీడా సామగ్రి కొనుగోలుకు ఇటీవల నిధులు విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, గిరిజన పాఠశాలలకు నిధులు కేటాయించింది. ఈ నిధులతో రోజు వారీ కార్యక్రమాల నిర్వహణతో పాటు ఇంటర్నెట్, స్టేషనరీ, క్రీడా సామగ్రి కొనుగో లుకు వెసులుబాటు కల్పించింది.

● జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో 1,007 పాఠశాలల నిర్వహణకు, క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.2 కోట్ల 17 లక్షల 5 వేల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో రూ.75 లక్షల 75వేలు క్రీడలకు వెచ్చించింది. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠ శాలలు ఇందులో ఉన్నాయి.

● విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేసింది. ఒకటి నుంచి 30 మంది విద్యార్థులు ఉంటే సంవత్సరానికి రూ.10 వేలు, 31 నుంచి 100 మంది ఉంటే రూ.25 వేలు అందించనున్నారు. 101 నుంచి 250 మంది విద్యార్థులు ఉంటే రూ.50 వేలు, 251 నుంచి 1000 మంది విద్యార్థులు ఉంటే రూ.75 వేలు, వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఉంటే లక్ష రూపాయల వరకు నిధులు వస్తున్నాయి. వీటిని ప్రభుత్వం రెండు విడుతల్లో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నది. మంజూరు చేసిన నిధులతో ఏఏ క్రీడా సామగ్రి కొనుగోలు చేయాలో ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకా లను విడుదల చేసింది.

● పాఠశాలల వారీగా..

ప్రాథమిక పాఠశాలల్లో. రెండు క్రికెట్ బ్యాట్లు, చిన్న సాఫ్ట్‌బాట్, నాలుగు టెన్నిస్ బంతులు, రెండు ఫుట్‌బాల్‌లు, ఒక బాస్కెట్ బాల్‌లు, నాలుగు టెన్నిస్ బంతులు, రెండు ఫుట్‌బాట్‌లు, ఒక బాస్కెట్‌బాల్, ఆరు స్కిప్పింగ్ రోప్స్, ఒక టెక్నికాయిట్ రింగ్, ఒక ఐరన్ బాక్స్ కొనుగోలు చేయవచ్చు. కా గా ప్రాథమి కోన్నత పాఠశాల్లో షాట్‌పుట్ ఒకటి, డిస్కస్ త్రో ఒకటి, స్కిప్పింగ్ రోప్స్ రెండు, ఒక క్రికెట్ బ్యాట్, రెండు టెన్ని స్ బంతులు, వాలీబాల్ కిట్, ఒక హ్యాండ్‌బాల్, రెండు త్రో బాల్స్ ఒక ఫుటబాల్, ఐరన్‌బాక్స్ ఒకటి కొనుగోలు చేయవచ్చు.ఉన్నత పాఠశాలల్లో ఆరు స్కిప్పింగ్ రోప్స్, నాలుగు షాట్ ఫుట్, నాలుగు డిస్కస్ త్రో పరికరాలు, 20 బ్యాడ్మింటన్ బ్యాట్లు, నాలుగు క్రికెట్ బ్యాట్లు, 20 టెన్నిస్ బంతులు, రెండో త్రో బాల్స్ వాలీబాల్ నెట్, రెండు వాలీబాల్ బంతులు, రెండు ఫుట్‌బాల్, రెండు ఐరన్ బాక్స్‌లు కొనుగోలు చేయాలని సూచించింది.

● పలు పాఠశాలల్లో మైదానాలు కరువు..

ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యాలు పెంచేందుకు నిధులు మంజూరు చేసినప్పటికీ సగానికి పైగా పాఠశాలలకు క్రీడా మైదా నాలు కరువయ్యాయి. దీంతో పాటు వ్యాయామ ఉపా ధ్యాయులు లేక పోవడంతో ప్రభుత్వ ప్రయత్నం ఏ మేరకు సఫలం అవుతుందో అర్థం కాని పరిస్థితి నెల కొంది పాఠశాలలకు క్రీడా మైదా నాలు ఏర్పాటు చేసి వ్యాయామ ఉపాధ్యాయులను నియమిస్తే ప్రభు త్వ ఆ శయం పూర్తి స్థాయిలో నెరవేరే అవకాశాలు ఉన్నాయి.

మార్గదర్శకాలు విడుదల..

- గమనియాల్, జిల్లా విద్యాధికారి



పాఠశాలల్లో ఏ క్రీడా సామగ్రి కొనుగోలు చేయాలో మార్గదర్శకాలు విడుదల చేశాం. ప్రధానోపాధ్యాయులు మాత్రమే క్రీడా వస్తువులు కొనుగోలు చేయాలి. ఆ వివ రాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. నిధుల సక్ర మంగా వినియోగించేలా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యు లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఉన్నత పాఠ శాలల్లో ఎంఈవోలు పర్యవేక్షించనున్నారు. కొనుగోళ్ల లో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటాం.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆదరించాలి



కౌటాలలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్, టీచర్స్ సమస్యల పరిష్కారానికి బీజేపీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ అన్నారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమరయ్యలను భారీ మెజార్టీతో శాసన మండలిలో ప్రజల గొంతుక వినిపించాలంటే వీరిని గెలిపించాలని కోరారు. దేశంలో మోదీ నాయకత్వాన్ని బలపర్చడానికి బీజేపీని గెలిపించాలని అన్నారు. సమావేశానికి మండలాధ్యక్షుడు అశోక్, విజయకుమార్, రామన్న అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మల్లయ్య, తిరుపతిగౌడ్, కృష్ణ, నానాజీ, రంగన్న, మోహన్, పవన్, బాబురావు, శ్రీనివాస్, బలరాం, వరప్రసాద్, కమలాకర్, జగదీష్, లచ్చయ్య, మల్లేష్, భీమేష్, మంచిర్యాల, గోవర్దన్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమరయ్య ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాగజ్‌నగర్‌రూరల్, కౌటాల, చింతలమానేపల్లి, మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలను ఓటర్లకు వివరిస్తూ గెలుపు కోసం పాటుపడాలని కోరారు. సమావేశంలో మండలాధ్యక్షుడు అశోక్, విజయకుమార్, రాము, జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మల్లయ్య, తిరుపతిగౌడ్, కృష్ణ, నానాజీ, రంగన్న, మోహన్, పవన్, బాబురావు, శ్రీనివాస్, బలరాం, వరప్రసాద్, కమలాకర్, జగదీష్, లచ్చయ్య, మల్లేష్, భీమేష్, మంచిర్యాల, గోవర్దన్, కేశవరెడ్డి, విజయ్, రవి, చందు, తిరుపతి, మధుకర్, వెంకటేష్, శ్రీను, కమలాకర్, మహేష్, మిథున్ కవిరాజ్, గోమాజీ తదితరులు పాల్గొన్నారు.

శిశు మందిరాలు సంస్కృతికి నిలయాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సరస్వతి శిశు మందిరాలు సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, శిశు మందిర్ విద్యాపీఠం దక్షిణ మధ్య క్షేత్రం సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన 1979-2024 శివు మందిర్ పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనంలో మాట్లాడారు. మనిషి వికసించాలంటే చదువుతో పాటు క్రమ శిక్షణ కలిగి ఉండాలన్నారు. ఇవన్నీ ఒక సరస్వతి శిశు మందిర్ పాఠశాలల దొరుకుతుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సరస్వతి శిశు మందిరాలు పోటీ పడుతున్నాయని చెప్పారు. మన మాతృభాష అయిన తెలుగుకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆకాంక్షించారు.మాజీ జడ్పీటీసీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తమ పిల్లలు శిశు మందిర్‌లో చదివి విదేశాల్లో స్థిరపడి మంచి పేరు పొందారని తెలిపారు. ముందుగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి పరిషత్ నాయ కు లు శ్రీనివాస్, రాజరెడ్డి, వెంకటేష్, డాక్టర్ విష్ణువర్ధన్‌రావు, ప్రధానో పాధ్యాయుడు సుధాకర్, సతీష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

వాంకిడి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పది రోజులుగా ఫ్రెండ్స్ ఎలెవన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో 50 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ఫ్రెండ్స్ ఎలెవన్, డైలీ క్రికెట్ యూత్ జట్ల తలపడ్డాయి. డైలీ క్రికెట్ జట్టు 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.22,222, రన్నర్ జట్టుకు 11,111 నగదుతో పాటు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో షఫిక్, చంద్రశేఖర్, వినోద్ పాల్గొన్నారు.

కైరిగూడలో హోమం

రెబ్బెన, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం కైరిగూడ గ్రామ పంచాయతీ కేంద్రంలో ఆదివారం జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ మందిరం ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా సేవాలాల్ భక్తులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుబ్బారావు, చవాన్, హిందాల్, గణపతి, రమేష్‌తో పాటు పూజారి వసంత్ రావు, శంకర్, రవీందర్, శివాణి పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులను పెడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై తప్పుడు పోస్టులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి ఆర్థిక సహాయం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ భట్టుపల్లి చౌరస్తాలోని మున్నూరు కాపు సంఘ భవనంలో నివసిస్తున్న ఉప్పరి మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.21వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు గజ్జి రామయ్య, పెద్దపల్లి కిషన్‌రావు, జలపతి, సుంకరి తిరుపతి, కలికోట రమణయ్య, సిద్దం శ్రీనివాస్, రాజన్న, అఖిలేష్, జవాజీ సంతోష్, సురేందర్, శంకర్, చంద్రయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లూరులో క్రికెట్ పోటీలు

పెంచికలపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లూరు, కొత్తగూడ గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ క్రికెట్ టోర్నమెంట్‌ను శివాజీ యూత్, గ్రామ పెద్దలు ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు అందించనున్నట్లు నిర్వాహకులు రవి, సుధాకర్ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రతిభా కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని పీటీజీ గిరిజన గురుకులంలో మొత్తం 320 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 20 మంది గైర్హాజరు అయ్యారు. కాగా గిరిజన బాలికల కళాశాలలో 245 మందికి గాను 24 మంది గైర్హాజరు అయ్యారు. గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో 320 మందికి 14 మంది గైర్హాజరు అయి నట్లు ఆయా సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు భద్రయ్య, అనిత, తక్షశిల తెలిపారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జాతరకు ఆలయం ముస్తాబు

- ఏటా మహా శివరాత్రి సందర్భంగా వేడుకలు



జాతరకు ముస్తాబవుతున్న ఆలయం

కౌటాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని తాటిపెల్లి శివారులో ఉన్న సిద్ధి హనుమాన్ ఆలయాన్ని శివరాత్రి జాతరకు ముస్తాబు చేస్తున్నారు. ఈ ఆలయం వార్ధా నది మధ్యలో డెల్టా ప్రాంతంలో ఉంది. తెలంగాణకు సరిహద్దుగా వార్ధా నది మధ్యలో తాటిపెల్లి గ్రామ శివారులో ఈ ఆలయం ఉంటుంది. ఏటా శివరాత్రి సందర్భంగా నిర్వహించే జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. 13వ శతాబ్దంలో తాటిపెల్లి శివారులోని వార్ధా నది మధ్యలోని ఎత్తైన ప్రదేశంలో ఈ ఆలయం వెలసింది. అప్పటి నుంచి ప్రతి శివరాత్రికి నది ఒడ్డున జాతర నిర్వహిస్తున్నారు. ఏటా జాతర మహోత్సవంలో భక్తులు ఇచ్చే కానుకలతోనే కమిటీ సభ్యులు ఆలయాన్ని అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. ఆలయానికి ఇరువైపులా నది ప్రవహించడంతో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకోవటానికి ఆసక్తి కనబరుస్తుంటారు. ఆలయం వెలసిన చోట ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో భక్తుల సందడి ఉంటుంది. జాతర నిర్వహించే రోజుల్లో మరాఠీ, తెలుగుకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.



ఆలయంలోని శివలింగం

నిలిచిన మిషన్ భగీరథ నీరు

- గ్రామాల్లో వారం రోజులుగా తాగునీటి ఎద్దడి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దహెగాం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మిష న్ భగీరథ నీటి సరఫరా వారం రోజులుగా నిలిచి పోవడంతో దహెగాం మండలంలోని సుమారు 24 గ్రామపంచాయ తీల తో పాటు అవాస గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగు వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుండడంతో నీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు నీటి కోసం తిప్పలు పడుతున్నారు. చేతి పంపుల వద్దకు నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని మహిళలు వాపోతున్నారు. ప్రస్తుతం ఎండలు ముదురుతున్నందున తాగునీరు, ఇతర అవసరాలకు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. దహెగాం మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో 40 కుటుంబాలకు గాను రెండు చేతి పంపులు ఉన్నాయి. వీటి నుంచే తాగునీరు, ఇతర అవసరాలకు తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం, సాయంత్రం సమయంలో నీటి కోసం చేతి పంపులు వద్ద మహిళలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇట్యాల, బొప్పారం, కోత్మీర్, బీబ్రా గ్రామాల్లోని ఇదే పరిస్థితి ఉందని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దహెగాంలో నీటి కోసం చేతి పంపు వద్ద ఉన్న మహిళలు

ట్యాంకర్ ద్వారా అందజేయాలి..

- పశుల లక్ష్మి, దహెగాం



దహెగాం ఎస్టీ కాలనీలో నీళ్లకు ఇ బ్బంది పడుతున్నాం. చేతి పంపుల వద్ద వెళ్లి తెచ్చుకుంటు న్నాం. దీంతో కూలి పనులకు వెళ్లేందుకు ఆలస్యమవుతోంది. వాటర్ ట్యాంక్‌తో కాలనీకి నీళ్ల అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

వారం రోజులుగా అవస్థలు..

- సోనులె లక్ష్మి, ఇట్యాల



మిషన్ భగీరథ నీరు నిలిచిపోవడంతో వారం రోజులుగా ఇ బ్బందులు పడుతున్నాం. ప్రజలు ఇబ్బంది పడకుండా రక్షిత మం చినీటి పథకాల ద్వారా అయినా తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

పదిహేను రోజుల్లో పనులు పూర్తి చేస్తాం..

- లక్ష్మీనారాయణ, ఆర్అండ్‌బీ డీఈ

పదిహేను రోజుల్లో పనులు పూర్తవుతాయి. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు పనులు వారం క్రితం మొదలు పెట్టి పనులు చేపడు తున్నాం. మరో పదిహేను రోజుల్లో పనులు పూర్తి చేసే అవకాశం ఉంది, అప్పటి వరకు మిషన్ భగీరథ నీటి సరఫరా చేసే అవకాశం లేదు.